యం తెలిసిన గాయకుడు కచ్చేరీలో "కళ్యాణి" అరగంట గొప్పగా పాడి సభికులందరి చేతా "భేష్" అనిపించుకున్నాడు. సభ అంతమయ్యే వేళకి అధ్యక్షుడు తాపీగా "కళ్యాణి" పాడేరేమండీ? అని పృచ్ఛచేసేడు. గాయకుడూ, యితర సభ్యులూ కూడా తెల్లబోయారు. అయ్యగారికి సంగీతంలో ఏ మాత్రం ప్రవేశం ఉందో అందరికీ వెల్లడయింది. కొందరు వర్ణం ముగిసీ ముగియకుండానే ఏ జావళీయో, ఏ వెంకిపాటో, ఏ హిందీపాటో పాడమని అడుగుతారు. వారు చివరిదాకా ఓపిక పట్టలేనివారు. పాట అడిగిన వెంటనే పాడకపోతే అల్లరిచేయడం. యిదీ వీరి వరస.

కొందరు వచ్చేది వినడానికి కాదు; వినిపింపబడడానికి వీరు కూర్చున్న వాళ్లు కూర్చోక కచ్చేరీ మంచిరక్తిగా ఉన్న సమయంలో తేలుకుట్టినట్లు లేచి నుంచుంటారు. నుంచుని "సోదరసోదరీమణుల్లారా! మిమ్మల్ని మధ్యలో ఆపినందుకు చాలా విచారిస్తున్నాను. ఈ గానసభనిగూర్చి రెండు ముక్కలు చెప్తా"నంటూ ఒక్క అరగంట అనర్గళంగా ఊకదంపుడు ఉపన్యాసం కొట్టాడు. యిట్లాంటి ప్రతి ఒక్కరూ, "శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగానరసం ఫణిః" యిత్యాది ఊకపదాలు నాలుగు వల్లేస్తారు. యిహవీరు ప్రతి సభకి హాజరై సభలో వారిదికూడ ఒక అంశమల్లే ఉపన్యాసాలు యిస్తారు. వీళ్ళని మధ్యలో చప్పట్లుకొట్టి బాబూ! మేంవినలేం అని కూర్చోబెట్టాల్సిందే. యిల్లాంటి రసాభాసలతో కూడుకొన్న గానసభకి వెళ్ళి అవస్థపడే దానికన్న చక్కగా యింట్లో రేడియోముందు కూర్చుని నిశ్శబ్దంగా మనకు కావల్సినపాట వినడమే నయమనుకుని సభలకి వెళ్ళడం మానేశాను. యిదంతా "ఎందుకు రాలేదండీ?" అని అడిగేవాళ్ళతో చెబితే ఊరుకుంటారా? పొగరు మోతు అని బిరుదిచ్చేసి ఊరుకుంటారు. అందుకని ఏదో ఒక అబద్ధం ఆడాల్సి వస్తోంది.

---

కథానిక

# ప్రజారాజ్యస్థాపనలో ప్రథమఘట్టం

అంగర సూర్యారావు

రామయ్య ప్రెసిడెంటు పదవికి అభ్యర్థిగా నిలబడగానే ఊళ్ళో కొంత సంచలనం కలిగింది. అతని గతచరిత్రనంతా ప్రజలు తిరిగి జ్ఞప్తికి తెచ్చుకొని కథలలా చెప్పుకోవడం ప్రారంభించారు. వూళ్ళో సినిమాహాలు కట్టించి ప్రజలకు విజ్ఞానాన్ని వినోదాన్ని అందించేడని కొందరు. రేషన్ రోజుల్లో ప్రజలకు బియ్యం అందుబాటులో లేనప్పుడు (రహస్య)సంచార బియ్యం షాపుల్ని నెలకొల్పి ప్రజాసేవచేశాడని కొందరు, వూళ్లోని నిరుద్యోగుల్ని (వాళ్ళని రౌడీలని కిట్టనివాళ్ళంటారు)పోషిస్తున్నాడని కొందరు. ఇలా రకరకాల కథలు ప్రచారంలోనికి వచ్చాయి. మిగిలిన విషయాలు ఎలావున్నా రామయ్యను బ్లాక్ మార్కెట్ నేరంక్రింద పోలీసులు అరెస్టుచేసి తీసుకుపోవడం ప్రజలందరికీ తెలుసు. తరవాత కథమాత్రం ఎవరికీ తెలీదు. కాని ఆ మర్నాడే ఆయన స్వేచ్ఛగా తన మేడమీద తిరుగుతూ వుండడం చాలామంది చూశారు.

యిటువంటి మహామహుడికి ప్రత్యర్థిగా ఎవరు నిలబడతారా అని ప్రజలంతా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.—నాలుగేళ్ళనుంచీ రాజకీయ భవిష్యత్తు కోల్పోయిన శాస్త్రి యీ సమయంలో తల పైకెత్తిచూశాడు. గ్రామ రాజకీయాలు అద్భుతంగా కనిపించినై. యిటువంటప్పుడు తను మౌనంవహించడం రాజకీయవేత్త లక్షణంకాదనుకున్నాడు. "గ్రామసేవాసంఘం" అనే పేరుతో కొత్తపక్షాన్ని స్థాపించాడు, శాస్త్రి ప్రెసిడెంటు పదవికికూడా ప్రత్యర్థిని నిలబెడతాడని అందరూ నమ్మారు. కాని రామయ్యకు ఎదురుగా నిలబడే వ్యక్తి ఎవరో ఎంత ఆలోచించినా వాళ్ళ బుర్రలకు తట్టలేదు. యీ పరిస్థితులలో ఒకనాడు రామయ్యగారు వచ్చి శాస్త్రి యింటిముందు ఆగింది.

రెండు గంటలకాలం సంప్రతింపులు జరిగినై. వాటి పర్యవసానం ఏమిటో ఆ రోజు మాత్రం ప్రజలెవరికీ తెలీలేదు.

ఆ మర్నాడు మైదానంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. రామయ్యవంటి నిస్వార్థ ప్రజా సేవకుడు పంచాయతీబోర్డు ప్రెసిడెంటు పదవికి అభ్యర్థిగా నిలబడడం గ్రామప్రజల అదృష్టమనీ రామయ్యను తన పార్టీకూడా బలపరుస్తున్నదనీ అక్కడ సమావేశమైన పదివేల ప్రజానీకానికీ శాస్త్రి తెలియజేశాడు శాస్త్రి నిలబెట్టబోయే కొత్త అభ్యర్థిపేరు తెలుసుకోవాలని కుతూహలంతో వచ్చిన ప్రజలకు ఆశాభంగం కలిగింది. వెంటనే వేదికమీద రాళ్లు, సిగరెట్లు వగైరా పడడం ప్రారంభమయింది. శాస్త్రిని కారులో కూర్చోబెట్టి అతికష్టం మీద ప్రజల మధ్యనుంచి తీసుకుపోయారు. గందరగోళం మధ్య సభ ముగిసింది. రామయ్యదగ్గర ఐదువేలు తీసుకొని ప్లేటు ఫిరాయించాడని కొందరు, శాస్త్రి బతుకంతా రంగులు మార్చడమేనని కొందరు చెప్పుకుంటూ వెళ్ళిపోయారు.

బోర్డు ప్రెసిడెంటుపదవికి రామయ్యకు ప్రత్యర్థిగా వెంకయ్య నిలబడుతున్నాడన్న వార్త గ్రామ ప్రజలనందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది. వెంకయ్య రామయ్యకు స్వయంగా మేనల్లుడు యువకుడు. రామయ్యతో సరి సమానంగా డబ్బున్నవాడు. రామయ్యకు ఎదురు నిలబడగలవాడు దొరికినందుకు ప్రజలంతా సంతోషించారు. వెంకయ్యను అతివాద రాజకీయ పార్టీకూడా బలపరిచింది. దీనితో వెంకయ్య బలం మరింత ఎక్కువైనట్లు కనిపించింది. వూళ్ళోని పెద్ద రైతులంతా రెండు పార్టీలుగా విడిపోయారు. ఒకపార్టీ రామయ్యనూ మరో పార్టీ వెంకయ్యను బహిరంగంగా సమర్థిస్తూ ప్రచారం ప్రారంభించారు. తండ్రి రామయ్యను బలపరిస్తే కొడుకు వెంకయ్యను మామ రామయ్యను బలపరిస్తే అల్లుడు వెంకయ్యను - యీ విధంగా బంధువులలోకూడా చీలికలు ఏర్పడినై.

అతివాద రాజకీయపార్టీ ప్రతివార్డుకూ తన అభ్యర్థులను నిలబెట్టింది. ఈపార్టీ అభ్యర్థులంతా కూలీలు, హరిజనులు, బళ్లుతోలుకు జీవించేవాళ్ళూను. ఈ అభ్యర్థుల పేర్లు వినడంతోనే వూళ్ళో పెద్దవాళ్ళందరికళ్ళూ కోపంతో ఎర్రబడినయి. యిన్నాళ్ళనుంచీ తాము కూర్చుంటున్న పంచాయతీబోర్డు కుర్చీలలో యీనిర్భాగ్యులు కూర్చుంటారా? వీళ్ళలో ఒక్కడుకూడా గెలవకుండా తగిన కట్టుబాట్లు చెయ్యాలనుకున్నారు. దీనికి తగిన ఉపాయం చెప్పగలిగినవాడు శాస్త్రి ఒక్కడే. పెద్దలంతా శాస్త్రితో సంప్రతించారు. —"ఇప్పుడు నిలబడిన అభ్యర్థులందరూ ఉపసంహరించుకొని డబ్బూ పలుకుబడీవున్న వ్యక్తి మాత్రమే పోటీకి నిలబడాలి. వార్డుకు యిద్దరి మధ్యేపోటీ జరగాలి. యీవిధంగా జరిగితే అతివాద రాజకీయపార్టీ అభ్యర్థులంతా ఓడిపోతారు.' శాస్త్రి సలహా అందరికీ నచ్చింది. ప్రతివార్డుకు బాగా డబ్బున్న వ్యక్తిని ఒక్కడినే పోటీకి నిలబెట్టారు.

వెంకయ్యను బలపరచిన పెద్దరైతులకుకూడా మిగిలిన అతివాద రాజకీయపార్టీ అభ్యర్థులను బలపరచడానికి మనసొప్పలేదు. కారణం వాళ్లు డబ్బులోను కులంలోనూ తక్కువ తరగతికిచెందిన వాళ్ళు కావడమే! ఎన్నికల తేదీ సమీపించే కొద్దీ వూళ్ళో అలజడి బాగా ఎక్కువ అవడం ప్రారంభమయ్యింది. మే నెలలో పొలం పనులు వుండవు గనక పాలేళ్ళు, కూలీలు అందరూ తీరుబడిగా ప్రచారంలో పాల్గొన్నారు. ఉభయ పక్షాలవాళ్ళు ప్రతివార్డులోనూ బహిరంగ సభలు పెట్టి బహిరంగంగా తిట్టుకున్నారు—విమర్శించుకున్నారు—కొట్టుకునేవరకూ వెళ్ళారు కూడా.

ఒకరోజు అతివాద రాజకీయపార్టీ బ్రహ్మాండమైన వూరేగింపు ఏర్పాటుచేసింది. చుట్టుపట్ల వున్న పల్లెటూళ్ళనుంచి వ్యవసాయకూలీలు, కార్మికులు కొన్ని వేలమందివచ్చి వూరేగింపులో పాల్గొన్నారు. కండలు మెలితిరిగి—కర్రలు భుజాన వేసుకొని—జయజయ ధ్వానాలు చేసుకుంటూ వూరేగే ఆ కూలి జనాన్ని చూసేసరికి వూళ్ళో పెద్ద మనుషులందరికీ భయం వేసింది. రామయ్య కూడా తన మేడమీద నుంచి వూరేగింపు చూశాడు. "వీళ్లు యింతమంది, దరిద్రులను ఎక్కడ సంపాదించేరురా భగవంతుడా!" అనుకున్నాడు. వూరేగింపు రామయ్య మేడ సమీపానికి వచ్చింది. మేడమీద రామయ్యను చూడ

గానే స్లోగన్సు వురిమాయి. "బ్లాక్ మార్కెట్ నశించాలంటే—రామయ్యను ఓడించాలి."

ఈ స్లోగన్ వినగానే రామయ్యకు రావలసినంత కోపం వచ్చింది. అతివాద రాజకీయపార్టీ ప్రజల్ని రెచ్చగొట్టి గ్రామంమీద వదిలేసిందనీ—అర్జంటుగా వచ్చి శాంతిని నెలకొల్పవలసిందనీ—అక్కడికి పది మైళ్ళదూరంలో వున్న స్పెషల్ పోలీసులకి రామయ్యా ఆ రాత్రే కబురు పంపించాడు. కాని ఆరాత్రి మాత్రం పోలీసు లెవరూ గ్రామంలో అడుగు పెట్టడానికి సాహసించలేదు. మర్నాడు మూడులారీలనిండా పోలీసులు వచ్చి వీధులలో కనిపించిన—ఆడామగ విచక్షతలేకుండా—ప్రతివారిమీదా అధికారం చెలాయించి వెళ్ళిపోయారు. ఆ సాయింత్రం జరిగిన బహిరంగ సభలో పోలీసుల నిరంకుశ చర్యలనుగురించి రామయ్యకూడా ఉపన్యసించాడు. పోలీసుల చర్యలను ఖండిస్తూ మంత్రిగారికి టెలిగ్రాంకూడా యిచ్చారు.

రామయ్య హరిజనవాడలో వోటుకు అయిదు రూపాయ లిచ్చి కొంటున్నాడని, వెంకయ్య వోటుకు ఎనిమిది రూపాయలిస్తున్నాడని పుకార్లు ప్రారంభ మైనయ్.

ఆ రోజే ఎలక్షను! ప్రతివార్డులోనూ పోలింగు బూత్ దగ్గర బ్రహ్మాండమైన ప్రచారం జరుగుతోంది. వూళ్లో వున్న కార్లూ బళ్ళూకూడా రెండు పార్టీలుగా విడిపోయినై. కొన్ని బళ్లకు రామయ్య జండా—మరికొన్ని బళ్ళకు వెంకయ్య జండా—తగిలించారు. ప్రతి యింటినుంచి స్త్రీలను పురుషులను తీసుకువచ్చి పోలింగు ఆఫీసుదగ్గర ఉచితంగా విడిచిపెట్టి బళ్ళూ కార్లూ వెనక్కి వెళ్ళిపోతున్నై. ఓటర్లను యిళ్ళకు తిరిగి తీసుకు వెళ్ళడానికి మాత్రం బళ్లు దొరకడంలేదు.

రామయ్య, శాస్త్రి మరికొందరు పెద్దలు కారులో పర్యటన ప్రారంభించారు.—ఎక్కడ చూసినా అతివాద రాజకీయపార్టీ తరఫునా వెంకయ్య తరఫునా ప్రచారం చాలా ఎక్కువగా జరుగుతోంది. రామయ్యకు మనసులో అధైర్యం కలిగింది. పక్కనున్న శాస్త్రి కేసిచూసి "నేను గెలుస్తానంటావా శాస్త్రీ?" అన్నాడు దిగులుగా. "ఫరవాలేదు. మూడు వార్డుల్ని మనం కట్టేశాం" అన్నాడు శాస్త్రి ధీమాగా.

"వాడు చూడు! వెధవ! నా దగ్గర పనిచేసే పాలేరు కొడుకు! నన్నిలా తిడుతున్నాడో! నే నోడిపోవాలట! వీడిరోగం కుదురుస్తాను!" కోపంతో కళ్ళెర్రచేశాడు రామయ్య.

"అదంతా ఎన్నికల ప్రచారం! యీ రెండు రోజులూమాత్రం మీరు శాంతంగా ఉండాలి!" అన్నాడు శాస్త్రి.

కారులో రామయ్యను చూడగానే జనం రెచ్చిపోయి మరీ కేకలువెయ్యడం ప్రారంభించారు. రామయ్యకుచాలా కోపం వచ్చింది. దమ్మిడీచెయ్యని దరిద్రులంతా తనను ఎంత నిర్భయంగా తిడుతున్నారు! వీళ్ళకు కొమ్ములిచ్చింది నిజంగా అతివాదరాజకీయపార్టీ! "ధనవంతులు నశించి దరిద్రులు ఉత్పత్తికావాలం"టారు—వీళ్ళకేం పోయేకాలంరా భగవంతుడా!" అనుకున్నాడు రామయ్య. ఈ పరిస్థితులలో వెంకయ్యకు జయంతప్పదనుకున్నాడు.

ఆరోజు గ్రామంలో చెదురుగా ఘర్షణలు జరిగినై. ప్రతిదరిద్రుడు. ప్రతిసామాన్యుడు ఆరోజు వాక్స్వాతంత్ర్యాన్ని వినియోగించుకున్నాడు. తమఐశ్వర్యంతో ప్రజలపై అధికారం చెలాయించే ప్రతిధనవంతుణ్ణి సామాన్య ప్రజలు ధిక్కరించి ప్రచారంచేశారు. ఇది నిజంగా గ్రామచరిత్రలో అపూర్వమైన మార్పు!

ఆ మర్నాడే ఎన్నికల ఫలితాలు తెలిసినయి. పదివోట్ల మెజారిటీతో రామయ్యా బోర్డు ప్రెసిడెంటుగా ఎన్నుకోబడ్డాడు. అన్ని వార్డులకూ మాత్రం అతివాద రాజకీయపార్టీ అభ్యర్థులు గెలిచారు.

ఆరాత్రి బాణాసంచాతో అతి వైభవంగా రామయ్య ఊరేగింపులో పాల్గొన్నాడు.

